క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న రంగు నాయుడు

మక్కువ: స్థానిక బీసీ కాలనీలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు హాజరై ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా 2వేల మంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు. కాలనీవాసులు నిర్వహించారు.

నేడు శంబర పోలమాంబ ఐదవ జాతర

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబరపోలమాంబ అమ్మవారి ఐదవ జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యం నిమిత్తం ఈవో వీవీ సూర్యనారాయణ, సీఐ రామకృష్ణ, ఎస్సై వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాట్లు నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు పులిహోర, లడ్డూ ప్రసాదాన్ని అందించేందుకు చర్యలు చేపట్టారు. నాల్గవ జాతరలో సుమారు 50 మంది పోలీసులు, 30 మంది దేవాదాయ శాఖ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

అల్లు ఎరుకునాయుడికి నివాళులు



అల్లు ఎరుకునాయుడికి నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: దివంగత ఎమ్మెల్యే అల్లు ఎరుకునాయుడికి మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర సోమవారం నివాళులు అర్పించారు. ఈ మేరకు పట్టణంలోని అల్లువీధిలో ఉన్న ఎరుకునాయుడి విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, సాలూరు నియోజకవర్గం 2వ ఎమ్మెల్యేగా ఎరుకునాయుడు సేవలు అందించారంటూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు గిరిరఘు తదితరులు పాల్గొన్నారు.

విజయగౌరికి మద్దతుగా ర్యాలీ

సాలూరు: టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరుతూ యూటీఎఫ్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బైక్ ర్యాలీని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు విజయకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

పార్వతీపురంటౌన్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సమమితి అధ్యక్షుడు ఈవీ నాయుడు అన్నారు. ఈ మేరకు సొమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ యామాన్యం 8 రాష్ట్రాలలోని 31 లక్షల మంది నుంచి పలు స్కీమ్‌ల పేరుతో రూ. 6.380 కోట్లను డిపాజిట్ల రూపంలో సేకరించిందని, కంపెనీ ఆర్థిక నేరాలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనా సమయంలో వారి పరిశీలనలోకి వచ్చిన అంశాలేనన్నారు. సమర్థ అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి బాధితుల సమస్యల పరిష్కారానికి కాలపరిమితితో కూడిన కార్యాచరణను అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

పార్వతీపురం రూరల్: గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తహసీల్దార్ వై.జయలక్ష్మి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని గంగాపురం పంచాయతీ తాన్నవలస, తొక్కుడు వలస, కొత్తపాకలు తదితర గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో 82 ఎకరాలకు సంబంధించి రీసర్వేలో జరిగిన సమస్యలపై రైతులు ఇచ్చిన అర్జీ మేరకు మళ్లీ సర్వేయర్ల సమక్షంలో సర్వే నిర్వహించి రైతులకు సంబంధించిన భూములను పంపిణీ చేయనున్నామన్నారు. సర్వేలో గుర్తించిన రైతులకు 1బి, పట్టాదారు పాసుపుస్తకాలను త్వరలో మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సర్వే సమస్యలు పరిష్కారం కావడంతో సీపీఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి, రైతుసంఘం నాయకులు పి. రాము, కడ్రక చిరంజీవి, తాడంగి రాము, మెల్లిక రాము తదితరులు తహసీల్దార్‌కు అభినందనలు తెలిపారు.

నాడు ఘనం.. నేడు ధైన్యం..!

- అధ్వానంగా మున్సిపల్ పాలన
- బైపాస్ పక్కనే కాలుస్తున్న చెత్త
- వెలువడుతున్న విషవాయువు
- సామాజిక మరుగుదొడ్ల మరమ్మతులపై మంత్రి ఆదేశాలు పట్టించుకోని అధికారులు
- ఎవరికి వారే తీరున మున్సిపల్ ఉద్యోగుల వ్యవహారం



గాంధీనగర్ వద్ద వేగావతి నది పక్కనే కాల్చివేసిన చెత్త



మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న పట్టణ పోలీస్‌స్టేషన్ మధ్యలో ఉన్న కాలువలో పేరుకు పోయిన మురుగునీరు



వేదసమాజం వద్ద కుప్పలుగా వేసి ఉన్న చెత్త

సాలూరు: నాడు ఘనం..నేడు ఘోరం..అన్న చందాన ఉంది సాలూరు మున్సిపాలిటీ పరిస్థితి. ఒకప్పుడు జాతీయ స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు పొందిన మున్సిపాలిటీ పరిస్థితి నేడు దయనీయంగా మారింది. ఎక్కడికక్కడ పారిశుద్ధ్య లోపంతో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తోంది. మున్సిపాలిటీలోని వార్డుల్లో పారిశుద్ధ్యలోపం అధికంగా కనిపిస్తోంది. తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్తగా సేకరిస్తున్న దాఖలాలు లేవు. వార్డుల్లో సేకరించిన చెత్త అక్కడే వార్డు శివారులో కాల్చివేస్తున్న సంఘటనలు పట్టణంలోని బంగారమ్మపేట వార్డులో కనిపిస్తున్న దుస్థితి. పలు మాంసాల వ్యర్థాలను సాలూరు శివారులో వేసే స్తుండడంతో దానినుంచి వచ్చే దుర్గంధం వల్ల ముఖ్యంగా సాలూరు-పాచిపెంట మార్గంలో ముక్కు మూసుకోకుండా ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

దోమలు, ఈగలు, పురుగులకు ఆవాసాలు

కాలువల్లో పేరుకుపోయిన మురుగునీరు, అందులో పడవేసిన చెత్తతో కాలువల్లో నీరు మురిగి అధ్వానంగా తయారవుతున్నాయి. దీనివల్ల వార్డుల్లోని కాలువలు ఈగలు, దోమలు, పురుగులకు ఆవాసాలుగా మారాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా అనారోగ్యాలు ప్రబలే ఆస్కారం ఉందని ప్రజలు వాపోతున్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యలోపం ఉన్నా అధికారులు, ప్రస్తుత ప్రభుత్వ పాలకులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విసిగిపోతున్న జిల్లా అధికారులు

మున్సిపాలిటీలో అధికార యంత్రాంగం తీరుతో జిల్లా అధికారులు విసిగి పోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మున్సిపల్ సిబ్బంది ఎవరికి వారే యమునా తీరే అన్న చందాన ఎవరు ఎప్పుడు వస్తారో ఎప్పుడు రారో వారికే తెలియని పరిస్థితి. సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించడం వంటి సంఘటనలను నేటి పాలకులు, అధికారులు గుర్తించిన సందర్భాలు ఉన్నాయి. ఎవరెన్ని హెచ్చరికలు, ఆదేశాలు జారిచేసినా నిమ్మకునీరెత్తనట్లు మున్సిపల్ కార్యాలయంలో పలువురు ఉద్యోగుల తీరు ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇటువంటి పరిస్థితుల్లో త్వరలో పట్టణంలో శ్యామలాంబ పండుగ జరగనుండడంతో పండగ ఏర్పాట్లు, నిర్వహణపై నేటి పాలకులు, జిల్లా అధికారులు మరింత ప్రత్యేక దృష్టి సారించక తప్పదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కమ్మేస్తున్న ప్రమాదకర పొగ

పట్టణంలో సేకరించిన చెత్తను స్థానిక బైపాస్ రోడ్డు పక్కనే పడవేసి కాల్చివేస్తున్నారు. దీంతో అక్కడి నుంచి వెలువడే పొగ వల్ల అటుగా ప్రయాణికులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ చెత్తలో విషపూరితమైన పదార్థాలు కూడా ఉండే అవకాశమున్న నేపథ్యంలో వాటి నుంచి వెలువడే చెత్త వల్ల పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ సమస్య పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణను అధికారులను కలిసి పట్టణ ప్రజలు విన్నవించినా నేటికీ సమస్య పరిష్కారానికి అడుగులు పడిన దాఖలాలు లేవు. త్వరలో జరగనున్న శ్యామలాంబ పండగ నేపథ్యంలో అధికసంఖ్యలో జనాభా రానున్న క్రమంలో జనసాంద్రత అధికంగా ఈ బైపాస్ రోడ్డు వైపు వచ్చే అవకాశం అధికంగా కనిపిస్తోంది. నెలలు దాటుతున్నా అమలు కాని మంత్రి హామీ మున్సిపాలిటీలో సామాజిక మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఇది ఆడబిడ్డల ఆత్మగౌరవ సమస్య అని పలుమార్లు స్త్రీశిశుసంక్షేమం, గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంత్రిగా ఆమె పదవి స్వీకరించిన తరువాత తొలుత మున్సిపాలిటీలో సామాజిక మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను పలుమార్లు ఆదేశించారు. వారం రోజుల్లో పనులు పూర్తిచేస్తామని ఆమెకు మున్సిపల్ అధికారులు చెప్పినప్పటికీ నెలలు దాటుతున్నా నేటికీ మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టలేదు.



బైపాస్ రోడ్డు పక్కనే దంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ

అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: పార్టీ అధికారంలో లేకపోయినా, నా గెలుపు ఓటములతో సంబంధం లేకుండా పార్టీ నాయకులు, కార్యకర్తల వెంటే ఉండి అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేటలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలను గ్రామ స్థాయిలో కలిసి వారితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. పార్టీ అధికారంలో లేదని ఎవరూ భావించవద్దన్నారు. మన పనులు మనం చేసుకోగలమన్నారు. అందరం కలిసి రానున్న రోజుల్లో పార్టీకి అండగా నిలిచేందుకు అడుగులు ముందుకు వేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు, పలగర మాజీ సర్పంచ్ భాస్కరరావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన నివాస గృహానికి వెళ్లి పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

100 రోజుల ఎస్ఎస్‌సీ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ డాక్టర్ ఎస్.తిరుపతినాయుడు

సీతానగరం: పదవతరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు సేవాభావంతో విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్ తిరుపతినాయుడు అన్నారు. ఈ మేరకు 100 రోజుల ఎస్ఎస్‌సీ యాక్షన్ ప్లాన్ అమలుకోసం జరుగుతున్న పర్యవేక్షణలో భాగంగా సోమవారం ఉదయం గాదెలవలస ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి నల్ల తిరుతినాయుడు స్టడీ అవర్ సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధనకు అవసరమైన విద్యాబోధన జరగాలని, ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా స్టడీ అవర్స్ నిర్వహించి విద్యాపరంగా వెనుకబడి ఉన్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అందుకనుగుణంగా ఉపాధ్యాయులను ప్రోత్సహించడానికి వీలుగా నెండునెలలుగా జిల్లాలో అన్ని పాఠశాలలకు స్టడీ అవర్స్ సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. గాదెలవలస ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న మ్యాథ్స్ స్టడీ అవర్‌ను పరిశీలించి పదోతరగతి విద్యార్థులను అకడమిక్ స్టడీపై ప్రశ్నలు అడిగారు. ప్రార్థన సమయంలో విద్యార్థులకు పరీక్షల్లో అవలంబించాల్సిన మెలకువలపై మోటివేషన్ స్పీచ్ ఇచ్చి పిల్లల క్రమశిక్షణ, పార్థన జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం అన్ని తరగతులను పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాలలో కార్యక్రమాలు అన్ని చక్కగా నిర్వహిస్తున్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూడడ్ల శంకరావును అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

బలిజిపేట: వేసవి ప్రభావం ప్రారంభం కావడంతో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు ప్రారంభమైంది. అందులో భాగంగా పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయం వద్ద ఈర్ల సంజీవినాయుడు ఆధ్వర్యంలో సోమవారం టీపీఆర్ పట్నాయక్ చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్నాయక్ మాట్లాడుతూ మనిషిలో సేవాభావం ఉంటే ఎప్పుడైనా, ఎవరికైనా, ఏరకంగా అయినా సేవలు అందుతాయని తెలిపారు. సంజీవినాయుడు ఎన్నో రకాలుగా ప్రజలకు సేవలు అందించడం ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. వేసవికాలం పూర్తయ్యేవరకు చలివేంద్రాన్ని నిర్వహించనున్నట్లు సంజీవినాయుడు తెలిపారు. ప్రారంభం రోజున యువకుడు గౌర్రెల శ్రావణ్ దంపతులు మజ్జిగను ఏర్పాటుచేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.సతీష్, పి.భాస్కర్, జి.రవితేజ, ఈ.మధు, ఎస్.భూషణరావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి



జీసీసీ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సాలూరు: అటవీఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, జీసీసీకి నిధులు కేటాయించాలని ఆదివాసీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షుడు సీదరపు అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని జీసీసీ ఆఫీసు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కురుకూటి, వెలగవలసలో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించాలని కోరారు. చింతపండు, కొండచీపుళ్లు, జీడి తదితర పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని కోరారు.

లేకుంటే గిరిజనుల నుంచి తక్కువ రేటుకు దళారులు కొనుగోలు చేసుకుని మార్కెట్లో ఎక్కువ రేటుకు అమ్ముకుంటున్న పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, జీసీసీ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు సుందరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

సాలూరు: పట్టణంలోని ఎలక్ట్రికల్ సబ్‌డివిజన్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ గోపాలరావు నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, సాంకేతిక, ఆర్థిక సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ఈ పరిష్కార వేదికలో తెలియపరిచి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

ఘనంగా వార్షిక కల్యాణోత్సవం

బలిజిపేట: మండలంలోని గలావల్లి శ్రీ ఉమాస హిత కామలింగేశ్వర దేవాలయంలో శివపార్వతుల వార్షిక కల్యాణ మహోత్సవాన్ని మామిడి వంశస్థులు, ధర్మకర్తలు, గ్రామపెద్దల సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మాఘమాసం బహుళ ఏకాదశినాడు ఆలయ వార్షికోత్సవ కల్యాణం గత 11సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. భక్తులు, ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అర్చకుల బృందం తెలిపింది. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

రీసర్వేపై అవగాహన సదస్సు

సాలూరు రూరల్: మండలంలోని మరిపల్లి పంచాయతీ ములక్కాయ వలస గ్రామంలో మూడు మండలాల తహసీల్దార్ కార్యాలయాల సిబ్బందికి జిల్లా జాయింట్ కలెక్టర్ శోభిక సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గతంలో నియోజకవర్గంలో పైలెట్ గ్రామంగా రీసర్వేకు ములక్కాయ వలసను ఎంపిక చేసి సర్వే చేశారు. సర్వేలో గతంలో తలెత్తిన సమస్యలపై ఆమె ఆరా తీశారు. అలాగే ముందు చేయబోయే రీసర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సాలూరు, మక్కువ, పాచిపెంట తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచాలి



శ్రీరంగరాజపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: విద్యార్థుల్లో నైపుణ్యం పెంచాలని, అందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని, ప్రాథమిక విద్య వారి భవిష్యత్తుకు పునాది అని ఎంఈఓ-1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు మండలంలోని బలిజిపేట, నారన్నాయుడువలస, శ్రీరంగరాజపురం, గలావల్లి, గేదెలపేటలలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. మంచి మార్కులు ఏ విధంగా సాధించాలనే దానిపై వారికి సూచనలు అందించారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్‌లు పరిశీలించారు. బోర్డుపై అక్షరాలు రాసి వాటిని విద్యార్థుల చేత చదివించారు. అకడమిక్ పుస్తకాల ప్రకారం వారిలో సామర్థ్యాలు పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై పరిశీలనతో దృష్టిపెట్టడం వల్ల వారిలో శ్రద్ధ పెరుగుతుందన్నారు. మంచి రాత, చదువు వారికి అందిస్తే భవిష్యత్తులో మంచి విద్యావకాశాలను సాధించగలరని సూచించారు. అందుకు అందరం పాటుపడాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజనంలో మంచి పోషకాహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషిచేయాలి

రానున్న పది పరీక్షలలో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేయాలని, జిల్లాకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఈఓ ఎస్.తిరుపతి నాయుడు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని చిలకలపల్లి, నారాయణపురం ఉన్నత పాఠశాలలను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి జరిపారు. విద్యార్థులు శ్రద్ధతో బాగా చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని నిరసిస్తూ పోస్టు కార్డు ఉద్యమం



ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని నిలిపివేయాలని, నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

సాలూరు: ఔట్‌సోర్సింగ్ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌ను రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మన్యం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆప్కాస్ రద్దును నిరసిస్తూ సోమవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ మేరకు పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న పోస్ట్ బాక్స్‌లో పోస్టు కార్డులు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు రాముడు, శంకర్రావులు మాట్లాడుతూ, ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులు థర్డ్ పార్టీ కాంట్రాక్టర్ల చేతుల్లోకి వెళ్తారని, అప్పుడు జీతాలకు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. ఎన్నికల్లో ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం, కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఇప్పుడు జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో చర్చించాలని, లేకుంటే భవిష్యత్‌లో ఆందోళనలకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు హరిబాబు, పార్వతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థినికి మద్దతుగా యూటీఎఫ్ ప్రచారం



సీతానగరం ఉన్నత పాఠశాలలో ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీతానగరం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరికి మద్దతుగా సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రచారం చేశారు. జిల్లా సహాధ్యక్షుడు వి.ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో మండలంలోని మరిపివలస, ఆర్ వెంకంపేట, గాదెలవలస, సీతానగరం, నిడగల్లు ఉన్నత పాఠశాలలు, అలాగే హోలీక్రాస్, జీజే కాలేజీ, జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయం, కేజీబీవీలో పీడీఎఫ్ బలపర్చిన అభ్యర్థి కె విజయగౌరికి ఈనెల 27న జరుగనున్న ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరుతూ ప్రచారంచేశారు. ప్రచార కార్యక్రమంలో విజయనగరం జిల్లా కార్యదర్శి ఎం.కేశవరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పి. సత్యనారాయణ, కె.శివకుమార్, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు మన్యం జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం. గోవిందరావు, బి.ఆదినారాయణ పాల్గొన్నారు.

యూటీఎఫ్ బైక్ ర్యాలీ

పార్వతీపురంటౌన్: ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.విజయగౌరి విజయాన్ని కాంక్షిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం పార్వతీపురం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బెలగాం సుందరయ్య భవనం దగ్గర ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్ వరకు సాగి తిరిగి బెలగాం చేరుకుంది. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి కె.భాస్కరరావు, ట్రెజరర్ కె.మురళి, జిల్లా కార్యదర్శులు ఎస్. శ్రీను, పి.వెంకటి నాయుడు, ఉపాధ్యాయులు, సీఆర్‌టీలు ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో చికెన్, ఎగ్ మేళా



వెంకంపేట గోరీల వద్ద చికెన్ మేళా నిర్వహించిన పశుసంవర్థక శాఖ అధికారులు

పార్వతీపురంటౌన్/రూరల్: కోడిగుడ్లు, కోడిమాంసంపై అపోహలు వద్దని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వెంకంపేట గోరీలు, కొత్తవలస, బైపాస్ రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద చికెన్, ఎగ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో అపోహలు తొలగించేందుకే చికెన్ మేళా నిర్వహించామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాధి లేదని నిర్ధారణ జరిగిందన్నారు. జిల్లాలోని కోళ్లలో ఎటువంటి అసాధారణ మరణాలు నమోదు కాలేదని నిర్ధారించినట్లు చెప్పారు. ముందస్తు వ్యాధి నిరోధక చర్యలలో భాగంగా జిల్లాలోని కోళ్ల రైతులకు తగు నివారణ చర్యలను చేపట్టి వ్యాధి వ్యాపించకుండా జాగ్రత్త వహించాలని సూచిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కోళ్ల రవాణాపై స్థానిక చెక్ పోస్టు సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. కోడిమాంసం, గుడ్లు వినియోగించే వారికి ఎటువంటి అపోహలు అవసరం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి బోగి చక్రధర్, ప్రసాద్, దినకుమార్, బి.శ్రీనివాసరావు, జయకిరణ్, రమేష్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

శివయ్యకు..గూడు లేదు..పూజ లేదు..

- ఈ మహాశివరాత్రికైనా స్వయంభుశివ లింగానికి పూజలందేనా?
- పక్కనే పారమ్మతల్లి కొండకు వేలాదిగా తరలుతున్న భక్తజనం



పొలాల్లో ఉన్న వైద్యనాథుడు

సాలూరు: శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. మరి ఆ శివుడే మహాశివరాత్రి వంటి పర్వదినాన ఎటువంటి పూజలు లేక వెలవెలబోతున్న పరిస్థితి. ఎంతో చరిత్ర కలిగిన స్వయంభూ శివలింగాన్ని భక్తులు మరుస్తున్నారు. కనీసం గూడు, పూజలు లేక వైద్యనాథుడిగా పిలుస్తున్న స్వయంభూ శివలింగం ఏళ్ల తరబడి వెలవెలబోతోంది.

గూడు కరువు

పాచిపెంట మండలంలోని చీపురువలస సమీపంలో గిరిజన ఆరాధ్యదైవం పారమ్మతల్లి వెలసిన పారమ్మకొండ వద్ద మహాశివరాత్రి, ప్రముఖ దినాల్లో ఘనంగా పూజలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పారమ్మకొండకు సమీపంలో వెలిసిన వందల సంవత్సరాల చరిత్ర ఉన్న గణపతి, నంది విగ్రహాలతో ఉన్న స్వయం భు శివలింగాన్ని భక్తులు మరుస్తున్నారు. పారమ్మకొండ సమీపంలోని పొలాల్లో ఉన్న వైద్యనాథుడిగా ఇక్కడ ప్రజలు పిలిచే శివలింగానికి కనీసం గూడు లేకుండా ఉంది. గూడు సంగతి పక్కన పెడితే శివరాత్రి, కార్తీకమాసంలో సైతం కనీసం పూజలకు నోచుకోని దుస్థితి. పక్కనే ఉన్న పారమ్మకొండకు వేలసంఖ్యలో భక్తులు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తున్నా ఆ మార్గంలోనే ఓ పొలంలో వెలసి ఉన్న శివుడిని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో పూజాపునస్కారాలు లేక వైద్యనాథుడు వెలవెలబోతున్నాడు. వందల సంవత్సరాల క్రితం ఈ స్వయంభూ విగ్రహం వద్దే ముందుగా పూజలు జరిగేవని తరువాతే పారమ్మకొండకు భక్తులు వెళ్లేవారని స్థానికులు చెబుతున్నారు. నేడు ఆ విగ్రహాలు పూజలు లేకుండా వెలవెలబోతున్నాయి. అయితే ఈ విగ్రహాలను తొలగించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారని భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నంది విగ్రహానికి బీటలు రావడం, వినాయక విగ్రహం బయటకు తీసి వేయడం వంటి పరిస్థితులు భక్తులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

బాలారిష్టాలు తొలగేదెన్నడో?

ఏ కష్టమొచ్చినా దైవాన్ని ప్రార్థిస్తాం. మరి ఆ దైవానికే గూడు, పూజలు లేని పరిస్థితి ఏర్పడింది. సాక్షాత్తు పరమశివుడే గూడు లేక మహాశివరాత్రి వంటి పర్వదినాన పూజలు లేక వెలవెలబోతున్నాడు. ఇకనైనా ఇక్కడ ఆలయం నిర్మించి పరమశివుడికి గూడు ఏర్పాటుచేయాలని భక్తులు కోరుతున్నారు. మరి ఆలయ నిర్మాణానికి మోక్షం ఎప్పుడు కలుగుతుందో వేచి చూడాల్సి ఉంది. ఈ మహాశివరాత్రినాడైనా అక్కడ పూజలు జరుగుతాయోమోనని పలువురు ప్రజలు ఆశిస్తున్నారు.